క్లుప్తంగా

రేషన్ డీలర్లంతా సమయపాలన పాటించాలి



నకరికల్లు: రేషన్ డీలర్లంతా సమయపాలన పాటించాలని తహసీల్దార్ కె.పుల్లారావు ఆదేశించారు. నకరికల్లులోని 2,3,4 నంబర్ల దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద ధరలపట్టిక, స్టాక్ బోర్డులు పెట్టాలని చెప్పారు. వృద్ధులు, వికలాంగులకు ఇళ్ల వద్దనే రేషన్ అందజేయాలని ఆదేశించారు. రికార్డులు ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని, తప్పులుతడకలుగా ఉండే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సిలిండర్‌కు అధిక ధర వసూలు చేస్తే చర్యలు



నకరికల్లు: గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.పుల్లారావు హెచ్చరించారు. స్థానిక ఇండేన్‌గ్యాస్ డీలర్, సిబ్బందితో తన కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులతో సత్ప్రవర్తనతో మెలగాలని తెలిపారు. మొదటి అంతస్తు, ఆపై ఇళ్లలో నివసిస్తున్న వృద్ధులు, వికలాంగులు సిలిండర్ లోపలకు పెట్టమని సహాయం కోరినప్పుడు నిరాకరించరాదని చెప్పారు. సిలిండర్ బుక్ చేసుకున్నాక నిర్ణీత గడువులోగా అందించాలని సూచించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, ఇండేన్ గ్యాస్ డీలర్ రాజకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఎన్‌ను సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే



నరసరావుపేటరూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు శుక్రవారం సందర్శించారు. కళాశాల భవనాలను పరిశీలించిన అనంతరం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు. కళాశాలలో వసతుల గురించి ఆరా తీశారు. యువతీ, యువకుల వసతి గృహాల నిర్మాణం దాదాపు పూర్తయిందని, పెండింగ్ పనులను పూర్తిచేసేందుకు యూనివర్సిటీ అనుమతి రావాల్సి ఉందని తెలిపారు. దాదాపు రూ.10కోట్ల మేర వసతి గృహాలకు రోడ్లు, పెండింగ్ పనుల కోసం నిధులు అవసరమవుతాయని వివరించారు. జేఎన్‌టీయూ వర్సిటీ నుంచి నిధులను తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యే తెలిపారు. ఆర్డీఓ మధులత, జేఎన్‌టీయూ డీఈ కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎంఈవో డి.బ్రహ్మేశ్వరరావు

రొంపిచర్ల: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఈవో డి.బ్రహేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాలు నిరోధక కమిటీల ఏర్పాటు, దూర విద్యా విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాలు వాడకం వల్ల మత్తుకు బానిసై, విచక్షణ జ్ఞానం కోల్పోతారన్నారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులను దూరంగా ఉండే విధంగా ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలని అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీఎం. సుభానీ, ఏఎస్ఐ కిషోర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో చంద్రబాబు మోసం

ఊటుకూరులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కరపత్రాల పంపిణీ

ఊటుకూరు(క్రోసూరు): చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పార్టీ ఎన్నికల సమయంలో అనేక అబద్ధాల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. కూటమి పాలన ఏడాది పూర్తిచేసుకున్నా ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదని తెలిపారు. మండలంలోని ఊటుకూరులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు వివరించారు. విద్యార్థులకు తల్లికి వందనం అంటూ కొంతమందికి మాత్రమే నగదు జమ చేసిందని తెలిపారు. పలువురికి పంగనామాలు పెట్టిందని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామన్న హామీని ఇప్పుడు ఇవ్వలేమంటూ చేతులెత్తేసిందని వివరించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా అప్పుల పాలు చేసిందని విమర్శించారు. ఆరోగ్యశ్రీ అమలు కాకపోవడంతో పేద ప్రజలు వైద్యం అందక నానా అవస్థలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. నాడు నేడు కింద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థుల చదువులు కార్పొరేట్ స్థాయిలో ఉండే విధంగా తీర్చిదిద్దారన్నారు. విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం పనిగట్టుకుని నాశనం చేసిందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలు అటకెక్కించేందుకు, ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని వివరించారు. ప్రజలందరూ జగనన్న వెంట ఉండి వచ్చేసారి ఆయన్ను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోరుకునే ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రజలకు తెలిపారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, ఊటుకూరు సర్పంచ్ బుచ్చయ్య , ఊటుకూరు మాజీ సర్పంచ్ జొన్నవరపు శ్రీనివాసరెడ్డి, అల్లురెడ్డి, టి.ప్రభాకరరెడ్డి, బాషా, ప్రచార కమిటీ కన్వీనర్ తిప్పరెడ్డి అప్పిరెడ్డి, ఎస్సీఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ చైర్మన్ గార్లపాటి దాసు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఊటుకూరులో కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పలు గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ



పట్నం మాలపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



రామకృష్ణాపురంలో పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి: స్థానిక పట్నం మాలపల్లిలో శుక్రవారం పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు జీవనాధారానికి పింఛన్లు భరోసాగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతి, ఎంపీపీ మేకల హనుమంతరావు, తహసీల్దార్ డానియేల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో ...

మండలంలోని ఇరుకుపాలెం గ్రామ శివారు రామకృష్ణాపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ లబ్ధిదారులకు సొమ్ము అందించారు. గ్రామంలోని ఎన్టీఆర్, కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కె.నగేష్, ఈఓపీఆర్డీ రూపవతి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దమ్మాలపాడులో టీడీపీ నేతల ప్రచారం

ముప్పాళ్ల: మండలంలోని దమ్మాలపాడులో ఇంటింటికీ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నేతలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నగదుజమ

నకరికల్లు: అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ మొదటి విడత ఆర్థిక సాయం శనివారం రైతుల ఖాతాల్లో జమకానున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు శుక్రవారం తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను సాగుభూమి ఉన్న రైతు కుటుంబాలు, అటవీ భూమి సాగుదారు కుటుంబాలు మొత్తం మండలంలో 9,904 మంది అర్హత పొందారని వెల్లడించారు. న్నారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ6.93 కోట్లు జమ కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్టం



పెదపాలెంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

అచ్చంపేట(అమరావతి): క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెదపాలెంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు 'తల్లిపాల సంస్కృతి.. ప్రోత్సాహానికి ప్రాధాన్యత'పై సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవంతి మాట్లాడుతూ తల్లిపాలు తాగిన బిడ్డ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటుందని తెలిపారు. సాధారణ ప్రసవం అయినా గంటలోపు బిడ్డకు ముర్రుపాలు కచ్చితంగా పట్టించాలని సూచించారు. పాలిచ్చేటప్పుడు బిడ్డ ఏటవాలుగా పడుకోబెట్టుకోవాలని తెలిపారు. తల్లి పడుకొని పాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఊపిరితిత్తులలోకి వెళ్లే ప్రమాదముందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

క్రోసూరులో..

మండలంలోని 88త్యాళ్లూరులో శుక్రవారం తల్లివారోత్సవాల సందర్భంగా సిబ్బంది ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. సెక్టార్ సూపర్ వైజర్ సయ్యద్ మహబూబిన్నీసా మాట్లాడుతూ గర్భిణులంతా తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలని తెలిపారు. బిడ్డకు పుట్టిన గంటలోపు పాలను తాగించాలని, ఆరు నెలల వరకు ఇవ్వాలని సూచించారు.

పెదకూరపాడులో...

ఐసీడీఎస్ క్రోసూరు ప్రాజెక్టు పరిధిలోని పెదపాలెంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వాలని వైద్య సిబ్బంది సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. తల్లి పాలతో బిడ్డ శారీరకంగా, మానసికంగా దృఢత్వం కలిగి ఉంటాడన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు. అనంతరం తల్లులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ, అచ్చంపేట పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు ఏసీడీపీఓ సంతోషికుమారి

సత్తెనపల్లి: ప్రసవం జరిగిన గంటలోపు తల్లి బిడ్డకు ముర్రుపాలు తాగించేలా చర్యలు తీసుకో వాలని, ప్రతి బిడ్డకు తల్లిపాలు అందించడమే సంకల్పంగా ముందుకెళ్లాలని ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు ఏసీడీపీఓ సంతోషికుమారి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్స వాలను పురస్కరించుకొని పట్టణంలోని 8,9 వార్డుల్లో గల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏసీడీపీఓ సంతోషి కుమారి మాట్లాడుతూ తల్లిపాలను తాగించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఎటువంటి అంటువ్యాధులు రావన్నారు. బిడ్డ మానసిక ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడతాయన్నారు. పాలు ఇవ్వడం ద్వారా తల్లికి మంచి జరుగుతుందన్నారు. డీసీపీఓ ప్రశాంత్, ఆర్‌డబ్ల్యూఓ నానమ్మ,ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల, ఏఎన్ఎం శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, తల్లులు, కిశోరీ బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ ఏసీడీపీఓ సంతోషి కుమారి

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌ఐ అమీనుద్దీన్, ప్రిన్సిపాల్ గుప్తా

సత్తెనపల్లి: స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు చక్కని క్రమశిక్షణ అలవాటవుతుందని సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్ అన్నారు. సత్తెనపల్లిలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో అమరావతి రీజియన్ ఆధ్వర్యంలో భారత స్కౌట్స్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ అమీనుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంచుకోవడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపునకు 35 విద్యాలయాల నుంచి 250 మంది విద్యార్థులు రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. క్యాంపు నాలుగు రోజులు జరుగుతుందని, విద్యార్థులంతా సద్వినియోగపరచుకోవాలని ఆయన తెలిపారు. లీడర్ ఆఫ్ క్యాంప్ ఉషారాణి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ ట్రైనీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పీడీ కిరణ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: 'స్మార్ట్ మీటర్లు.. మా ఇళ్లకు పెట్టవద్దు' అంటూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని 6వ వార్డు గోపిరెడ్డివారి వీధిలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. మీటర్లకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు.ఈ సందర్భంగా పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి జడ రాజ్‌కుమార్ మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్లు బిగించితే కరెంటు బిల్లులు విపరీతంగా వస్తాయని, ముందుగా రీచార్జి చేయించుకోవాలని తెలిపారు. బ్యాలెన్స్ అయిపోతే కరెంట్ సరఫరా ఆగిపోతుందని, మళ్లీ రావాలంటే రీచార్జి చేయించుకోవాలని సూచించారు. కరెంటు వాడకం డిమాండ్‌ను బట్టి ఉదయం ఒక రేటు, మధ్యాహ్నం ఒక రేటు, సాయంత్రం మరొక రేటు .. ఇలా రేట్లు పెరుగుతాయని వివరించారు. స్మార్ట్ మీటర్ బిగించటానికి వచ్చే సిబ్బందిని ఐక్యంగా అడ్డుకోవాలని గ్రామస్తులకు చెప్పారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు షేక్ మస్తాన్‌వలి, హనుమంతరావు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్



గంబుషియా చేపలను వదులుతున్న మున్సిపల్ కమిషనర్

సత్తెనపల్లి: కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోద, మెదడువాపు వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ సూచించారు. పట్టణంలో దోమల నివారణ చర్యల్లో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో బావుల్లో లార్వాలు తినే గంబుషియా చేపలను శుక్రవారం వదిలారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గంబుషియా చేపలు లార్వా, ప్యూపా దశలోని దోమ పిల్లలను ఆహారంగా తీసుకొని సంతతిని అరికడుతుందని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ వర్షపు నీరు వివిధ కంటైనర్లలో నిల్వ ఉండి దోమల సంతతి వృద్ధి చెందుతుందని తెలిపారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, మలేరియా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వరాలివ్వు ... వరలక్ష్మీ మాత !



సత్తెనపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవీ మాత



పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ప్రత్యేక అలంకరణలో శ్రీ మహాలక్ష్మి



బ్రాహ్మణపల్లిలోని శివాలయంలో ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాదేవి

- భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

సత్తెనపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ప్రముఖ ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కొందరు మహిళలు ఇళ్లలో లక్ష్మీదేవి విగ్రహాన్ని కొలువుదిర్చి పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించి వ్రతాన్ని ఆచరించారు. ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు. పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. మహిళలు పెద్దఎత్తున అభిషేకాలు, కుంకుమార్చనలో పాల్గొన్నారు. మహారాష్ట్ర వీధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో కన్యలు, సుహాసినులు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు.పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయినులు, విద్యార్థుల తల్లులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మన్నవ ధనలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆధ్యాత్మిక భావాలను నేటి తరానికి తెలియజేయడానికి ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీసరస్వతి శిశు మందిర్ పాఠశాల అధ్యక్షుడు దేవరశెట్టి రవికుమార్, కార్యదర్శి చలువాది చిన సత్యనారాయణ, రాష్ట్ర సంస్కృతి బోధ ప్రముఖ్ అబ్బూరి సత్యనారాయణ, తొమండ్రు సత్యనారాయణ, పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లిలో గల శ్రీకాశీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం(శివాలయం)లో అన్నపూర్ణాదేవికి శ్రావణమాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి కోనూరు శ్రీనివాసశర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, లలితా పారాయణం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మరకతలింగానికి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.



పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో సామూహిక కుంకుమార్చనలో మహిళలు



పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

అంతులేని కథ..చెప్పలేని వ్యధ

- 25 ఏళ్ల వయస్సులోనే రెండు పెళ్లిళ్లు.. ఐదుగురు ఆడపిల్లలు
- ఇద్దరు భర్తలు వదిలివేయడంతో లేబర్ కార్యాలయం ఆవరణలో జీవనం
- ప్రస్తుతం నిండు గర్భిణి.. కడుపున కవలలు
- పౌష్టికాహారం లోపం రక్తహీనతతో బాధపడుతున్న వైనం
- మూడేళ్ల కుమార్తె బిక్షాటనతోనే సాగుతున్న బతుకు బండి
- ఇదీ మహిళ షేక్ జరీనా దుర్భర స్థితి



వినుకొండ లేబర్ కార్యాయంలో ఇద్దరు పిల్లలతో నిండు గర్భిణి జరీనా

వినుకొండ : ఒక తప్పటడుగు జీవితాన్నే మార్చి వేసింది. ఇందుకు మచిలీపట్నానికి చెందిన షేక్ జరీనా జీవితం ఓ ఉదాహరణ. 25 ఏళ్లకే రెండు పెళ్లిళ్లు ఐదుగురు ఆడపిల్లలు. మళ్లీ తొమ్మిది నెలల గర్భిణి. కడుపులో రెండు ప్రాణులు. కులాంతర వివాహంతో ఇంటి నుంచి గెంటి వేసిన పుట్టింటి వారు. భర్తలు ఇద్దరూ వేధింపులకు గురి చేసి వదిలివేయడంతో దీనస్థితిలో పల్నాడు జిల్లా వినుకొండలోని ప్రభుత్వ లేబర్ కార్యాలయంలో తలదాచుకుంటున్న మహిళ షేక్ జరీనా. మూడేళ్ల కుమార్తె భిక్షాటన చేసి తెచ్చిన ఆహారంతోనే బతుకు బండి సాగిస్తుంది. ఈతి బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నం చేసింది. కడుపులో పెరుగుతున్న ప్రాణాలు గుర్తొచ్చి జీవశ్చవంలా బతుకుతోంది. వివరాల్లోకెళితే.... మచిలీపట్నంకు చెందిన షేక్ జరీనా తండ్రి మహమ్మద్ తాపీమేస్త్రి. జరీనా 18 ఏళ్ల వయస్సులోనే కులాంతర వివాహం చేసుకుంది. తన చిన్నమ్మ చెప్పిన మాయ మాటలు నమ్మి అదే టౌన్‌కు చెందిన వెంకటరత్నం అనే బేల్దారీ మేస్త్రిని వివాహం చేసుకుంది. నలుగురు ఆడపిల్లలు భవానీ, చంద్రకళ, అనూ, రమ్య జన్మించారు. భర్త మద్యానికి బానిసగామారి నిత్యం వేధిస్తుండటంతో ఇద్దరూ విడిపోయారు. ముగ్గురు పిల్లలను అనాథ శరణాలయంలో చేర్పించారు. రమ్య అప్పటికి పాలు తాగే చిన్నపిల్ల కావడంతో తన వద్ద ఉంచుకుంది. అప్పటి నుంచి భిక్షాటన చేస్తుంది. మూడేళ్ల కిందట రవికుమార్ అనే వ్యక్తితో పరిచయం కావడంతో రెండో పెళ్లి చేసుకోగా ఓ పాపకు జన్మనిచ్చింది. ప్రస్తుతం జరీనా గర్భిణి. వైద్య పరీక్షకు వెళ్లగా, కవలలు అని చెప్పారు. దీంతో భర్త పుట్టబోయే ఇద్దరు పిల్లలతో కలిపి నలుగురు పిల్లల పోషణ కష్టంగా భావించి నంద్యాలలోని బంధువుల ఇంటికి వెళదామని నమ్మించి రైల్వే స్టేషనులో జరీనాను చంపేప్రయత్నం చేయగా తప్పించుకుని వినుకొండలోని లేబర్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఆ రోజు నుంచి భర్త ఆచూకీ లేదు.

పౌష్టికాహారం లోపం

నెలల తరబడి పౌష్టికాహారం లేక జరీనాకు రక్త హీనత ఏర్పడింది. పాలుతాగే పాపతో పాటు కవలలు పెరుగుతుండడంతో కేవలం 5 శాతమే ఉన్న రక్తంతో కాన్పు కష్టమని డాక్టర్లు తేల్చి చెప్పారు. దీంతో ఎవరూ లేక బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తోంది.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25439 (సత్తెనపల్లి)

90100 01840 (పెదకూరపాడు)

Office mail : sakshigntadvt@gmail.com